9

సాక్షి విశాఖపట్నం

శనివారం। 4 । నవంబర్ । 2023

ప్రగతికి రహదారి



అద్దంలా మెరుస్తున్న చినగదిలి నుంచి సూర్యతేజనగర్ వెళ్లే రహదారి

- రూ.112 కోట్లతో మేజర్ రహదారుల నిర్మాణం
- ఇప్పటికే చాలా వరకు పూర్తి
- వివిధ దశల్లో మరికొన్ని..



పెదవాల్తేర్ పోలమాంబ గుడి నుంచి బీచ్ రోడ్డుకు వెళ్లే రోడ్డు

డాబాగార్డెన్స్: విశాఖ పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. నగర సుందరీకరణకు జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా కోట్లాది రూపాయలతో రోడ్ల విస్తరణ చేపడతోంది. అధునాతనంగా రోడ్లను తీర్చిదిద్దుతోంది. నగరంలో రద్దీ దృష్ట్యా జంక్షన్ల అభివృద్ధితో పాటు రోడ్ల విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పనులు పూర్తి కాగా, మరికొన్ని ప్రాంతాల్లో చివరి స్థాయికి చేరుకున్నాయి. పెదవాల్తేర్ కరకచెట్టు పోలమాంబ గుడి నుంచి నేరుగా బీచ్‌కు పెద్ద ఎత్తున రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. ఆరిలోవ పరిధి సాయిబాబా ఆలయం (బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి)నుంచి ఆరిలోవ జంక్షన్‌కు రూ.2.35 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. అలాగే సీతమ్మధారలో రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇలా సిటీ పరిధితో పాటు భీమిలి, గాజువాక, అనకాపల్లి పరిధిలో రోడ్ల విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి.

జోన్ల వారీగా...

జోన్‌-1 పరిధిలో రూ.9.38 కోట్లతో ఒక రోడ్డు, జోన్‌-2 పరిధిలో రూ.7.11 కోట్లతో రెండు రోడ్లు, జోన్‌-3 పరిధిలో రూ.5.36 కోట్లతో ఒక రోడ్డు, జోన్‌-4 పరిధిలో రూ.16.04 కోట్లతో 3 రోడ్లు, జోన్‌-5ఏ పరిధిలో రూ.13.46 కోట్లతో రహదారి, జోన్‌-6 పరిధిలో రూ.11.39 కోట్లతో రోడ్డు, జోన్‌-7 పరిధిలో రూ.14.89 కోట్లతో 6 రోడ్లు, జోన్‌-8 పరిధిలో రూ.34.63 కోట్లతో 4 రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. వీటిలో దాదాపు పనులు పూర్తి కావచ్చాయి. కొన్ని ప్రారంభ దశల్లో ఉన్నాయి.

ఇవే కాకుండా ఆయా వీధుల్లో అంతర్గత రహదారులు కూడా కొన్ని పూర్తవ్వగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. జోన్‌-2 పరిధిలో రూ.3.94 కోట్లతో కైలాసగిరి మేజర్ రోడ్డు పనులు, రూ.3.17 కోట్లతో సూర్యతేజనగర్, శ్రీకాంత్‌నగర్ జంక్షన్‌లో రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూ.2.40 కోట్లతో సాయిబాబా ఆలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘ నిధులతో విజేత సూపర్‌మార్కెట్ జంక్షన్ నుంచి సాంకేతిక విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల వరకు రూ.2 కోట్లతో చేపట్టిన పనులు 50 శాతం మేర పూర్తయ్యాయి. ఎలక్ట్రికల్ పోల్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

అలాగే 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.2.32 కోట్లతో కొమ్మాది జంక్షన్, లా కాలేజ్, ఎండాడ జంక్షన్, డెయిరీఫాం జంక్షన్, హనుమంతవాక జంక్షన్లో చేపట్టిన పనులు 35 శాతం మేర జరిగాయి.

జోన్‌-3లో..

జోన్‌-3 పరిధిలో రూ.5.36 కోట్లతో సత్యం జంక్షన్ నుంచి వెంకోజీపాలెం వరకు మేజర్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ.కోటి 18 లక్షలతో సత్యం జంక్షన్ నుంచి రామాటాకీస్, వీఐపీ రోడ్డు, స్పెన్సర్ నుంచి ఆశీల్‌మెట్ట ఫ్లైఓవర్ వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. గురుద్వారా జంక్షన్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు రూ.కోటి 35 లక్షలతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. పెదవాల్తేర్ జంక్షన్ నుంచి శివాజీపాలెం జాతీయ రహదారి వరకు రూ.2.40 కోట్లతో చేపట్టిన పనులు 55 శాతం మేర పూర్తయ్యాయి. అలాగే రూ.40 లక్షలతో గురుద్వార జంక్షన్, రూ.35 లక్షలతో ఉషోదయ జంక్షన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

జోన్‌-4లో..

జోన్‌-4 పరిధిలో రూ.12.50 కోట్లతో జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణి బొమ్మ విగ్రహం వరకు రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.కోటి 82 లక్షలతో సెవెన్‌హిల్స్ ఆసుపత్రి నుంచి జగదాంబ జంక్షన్ వరకు, రూ.కోటి 71 లక్షలతో వాల్తేర్ అప్‌ల్యాండ్ మేజర్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ.2.5కోట్లతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి పోస్టాఫీస్, సౌత్ జైల్‌రోడ్డు నుంచి కాన్వెంట్ జంక్షన్ (వయా చావులమదుం) వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. రూ.కోటి 10 లక్షలతో వెలంపేట రోడ్డు, మున్సిపల్ స్టేడియం జంక్షన్ నుంచి దుర్గాలమ్మ ఆలయం జంక్షన్ వరకు కోట వీధి జంక్షన్ నుంచి సెయింట్ అలోసిస్ స్కూల్ వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి.

జోన్‌-5లో..

జోన్‌-5ఏ పరిధిలో అక్కయ్యపాలెం జాతీయ రహదారి నుంచి దొండపర్తి రాజమండ్రి సిల్క్ మందిర్ వరకు రూ.13.46 కోట్లతో పనులు చేపట్టనున్నారు. అందుకు సంబంధించి నిధులు మంజూరయ్యాయి. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.4.46 కోట్లతో చేపట్టిన మాధవధార మెయిన్ రోడ్డు పనులు 85 శాతం మేర పూర్తయ్యాయి. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రూ.కోటి 39 లక్షలతో చేపట్టిన రోడ్డు పనులు పూర్తయ్యాయి. జోన్‌-5బీ పరిధిలో 15వ ఆర్థిక సంఘ నిధులతో ఎస్ఎస్‌టీఎల్ గేట్ నుంచి పీఎఫ్ ఆఫీస్ వరకు రూ.కోటి 65 లక్షలతో చేపట్టిన పనులు 85 శాతం మేర పూర్తి కాగా, రూ.కోటి 33 లక్షలతో ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద చేపట్టనున్న పనులకు సంబంధించి టెండర్ దశలో ఉంది.

జోన్‌-7లో..

జోన్‌-7 పరిధిలో రూ.3 కోట్ల 6 లక్షలతో అనకాపల్లిలోని పెరుగు బజార్ జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్, రూ.94.10 లక్షలతో కోల్డ్ స్టోరేజ్ నుంచి అండర్ బ్రిడ్జ్ (వయా రైల్వే స్టేషన్ రోడ్డు)వరకు, రూ.3 కోట్ల 39 లక్షలతో వై.జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకు చేపట్టిన పనులు ప్రగతిలో ఉన్నాయి. రూ.2 కోట్ల 47 లక్షలతో జాతీయ రహదారి16 నుంచి వల్లూరు వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. రూ.3 కోట్ల 61 లక్షలతో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారద బ్రిడ్జి వరకు, రూ.కోటి 41 లక్షలతో నెహ్రూ చౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకు చేపట్టిన పనులు ప్రగతిలో ఉండగా, 15వ ఆర్థిక సంఘ నిధులతో అనకాపల్లి మెయిన్‌రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి కొట్నివీధి, పెట్రోల్ బంక్ నుంచి నాగులాపల్లి కెనాల్ వరకు రూ.48 లక్షలతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి.

రహదారుల విస్తరణ.. సుందరీకరణ

పరిపాలన రాజధానిగా విశాఖ కానున్న నేపథ్యంలో రహదారులు విస్తరించాల్సిన అవసరం ఉంది. విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. నగర సుందరీకరణలో భాగంగా రోడ్లు విస్తరిస్తున్నాం. అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నాం. జీవీఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో రోడ్ల విస్తరణతో పాటు సుందరీకరణ పనులు చేపట్టాం. ఇప్పటికే చాలా రోడ్లు పూర్తయ్యాయి. కొన్ని పనులు ప్రగతిలో ఉండగా, మరికొన్ని పనులకు ఇటీవల శంకుస్థాపనలు చేశాం. జీవీఎంసీ పరిధిలో ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాం. కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్ల ఆధునికీకరణ, జంక్షన్ల అభివృద్ధి పనులు చేపట్టాం.



– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

జోన్‌-6లో..

జోన్‌-6 పరిధి 86వ వార్డులో రూ.11 కోట్ల 39 లక్షలతో కూర్మన్నపాలెం ఆర్చ్ నుంచి సైమన్ నగర్ జంక్షన్ వరకు హాట్‌మిక్స్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ డివైడర్, ఎస్‌డబ్ల్యూ డ్రెయిన్ పనులు ప్రగతిలో ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3 కోట్లతో గాజువాక జంక్షన్ నుంచి వంటిల్లు జంక్షన్(కణితిరోడ్డు)వరకు చేపట్టిన పనులు ప్రగతిలో ఉన్నాయి. రూ.99 లక్షలతో లంకెలపాలెం జంక్షన్ రోడ్డు ప్రారంభం కాగా, గాజువాక జంక్షన్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. రూ.45 లక్షలతో గాజువాక శ్రీనగర్ జంక్షన్ వద్ద చేపట్టిన పనులు ప్రగతిలో ఉన్నాయి. రూ.45 లక్షలతో గాజువాకు పోలీస్ స్టేషన్ జంక్షన్, రూ.40 లక్షలతో ఆటోనగర్ జంక్షన్ పనులు ప్రగతిలో ఉన్నాయి.

జోన్‌-8లో..

జోన్‌-8 పరిధిలో పాత గోశాల జంక్షన్ నుంచి తొలిపావంచా వరకు రూ.11కోట్ల 35 లక్షలతో చేపట్టిన పనులు, రూ.7 కోట్ల 36 లక్షలతో తొలిపావంచా నుంచి కుమ్మరవీధి వరకు, రూ.9 కోటల 92 లక్షలతో కుమ్మరవీధి నుంచి అడవివరం వరకు చేపట్టిన పనులు ప్రారంభమయ్యాయి. రూ.6 కోట్లతో పోలమాంబ ఆలయం నుంచి బీచ్ కనెక్షన్ రోడ్డు పనులు ప్రగతిలో ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.35 లక్షలతో సింహాచలం జంక్షన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

ఎల్లోరా శిల్పం



అందాల తార శ్రీలీల విశాఖలో సందడి చేసింది. ఓ నగల దుకాణం ప్రారంభోత్సవానికి వచ్చి అభిమానులతో ముచ్చటించింది. డ్యాన్స్‌తో అదరగొట్టింది. శ్రీలీలను చూసి అభిమానులు కేరింతలు కొట్టారు.

10లో

వైఎస్సార్ సీపీ విశాఖ తూర్పు పరిశీలకుడిగా మొల్లి



మొల్లి అప్పారావు



కాశీ విశ్వనాథం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడిగా మొల్లి అప్పారావు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకుడిగా కాశీ విశ్వనాథంను నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

న్యూస్‌రీల్

వాసవీమాతకు 7 కిలోల వెండి చీర



వాసవీమాతను పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు జ్ఞానమందిరంలో పూజలందుకుంటున్న వాసవీమాతకు 7 కిలోల వెండితో చీరతో అలంకరించారు. ఈ మేరకు ఆ చీరతో వాసవీ మాతను పురవీధుల్లో ఊరేగించారు. నడుపూరు జ్ఞాన మందిరం నుంచి కాపులవీధి, కోమట్లవీధి, కుమ్మరవీధి తదితర వీధుల్లో కోలాటం, సన్నాయి మేళంతో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు మాట్లాడుతూ దాతల సహకారంతో అమ్మవారికి వెండి చీర చేయించామన్నారు. విజయనగరంలోని వైభవ్ జ్యూయలర్స్‌లో దీనిని తయారు చేయించామని, రూ.6.50లక్షలు ఖర్చు చేశామన్నారు. జ్ఞానమందిరంలో ఉన్న అమ్మవారికి శనివారం చీర ధరింపజేసి, 108 రకాల మిఠాయిలతో నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కులుకూరి మంగరాజు, కులుకూరి శ్రీనివాసరావు, బెల్లాల నాగేశ్వరరావు, వంకతాటి నర్సింహమూర్తి, బొడ్డు వెంకటరావు, బెల్లాల పెంటిబాబు, బచ్చు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

10,710 మందికి వైద్య సేవలు

నేడు 20 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు అర్బన్ ప్రాంతంలో శుక్రవారం 22 ప్రాంతాల్లో నిర్వహించారు. మొత్తం 10,710 మంది రోగులకు సేవలు అందించామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. నగరంలో జరుగుతున్న పలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం 20 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

'బస్సుయాత్ర'ను విజయవంతం చేయాలి

పార్టీశ్రేణులకు వైవీ సుబ్బారెడ్డి పిలుపు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎండాడ లా కాలేజ్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 6వ తేదీన గాజువాకలో బస్సు యాత్ర సభ జరగనుందని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అసౌకర్యం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గాజువాకలో ఏర్పాట్లను పార్టీ నేతలు పరిశీలించాలన్నారు. అనంతరం విశాఖ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించనున్న 'వై ఏపీకీడ్ జగన్' కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ అధ్యక్షుడు కోలా గురువులు, జిల్లా పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, జిల్లా పార్టీకమిటీ ఉపాధ్యక్షులు దామ సుబ్బారావు, విశాఖ తూర్పు నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల జేసీఎస్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ.సుబ్బారెడ్డి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

ప్రమాద రహిత విశాఖే లక్ష్యం

దొండపర్తి: ప్రమాద రహిత విశాఖగా నగరాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికలను పక్కాగా అమలు చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రూపొందించిన పలు కార్యాచరణలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించిన 15 ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు. వాటిని పూర్తిగా ప్రమాద రహిత జోన్‌గా చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందులో ప్రతిభ చూపించిన అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహకాలు, రివార్డులు ఇస్తామన్నారు.

ప్రతి జంక్షన్ మధ్య రెండు కిలోమీటర్లు ఉండేలా..

నగర పరిధిలో 2 నుంచి 3 కిలోమీటర్ల పరిధిలో ఒక జంక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి జంక్షన్‌లోను ట్రాఫిక్ సైన్ బోర్డులు ఉండాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరం మేరకు ప్రత్యేకంగా వాలంటీర్లను నియమిస్తున్నట్లు చెప్పారు.

ట్రాఫిక్ పోలీసులు వినియోగించే ట్రాకౌట్స్, ఆర్.ఎస్ మొబైల్స్, ఎన్‌హెచ్/ఎస్‌హెచ్ మొబైల్స్, క్రేన్ మొబైల్స్, ఇంట్రాసెప్టర్ వెహికల్స్, సుప్రా వెహికల్ వంటి అన్ని వాహనాలను సీపీ పరిశీలించారు.సమావేశంలో ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీలు జాన్‌ప్రకాష్, రాజీవ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ డాక్టర్ రవిశంకర్

పాఠశాల విద్యా సాధన సర్వే పరీక్షకు 14,202 మంది హాజరు

పద్మనాభం : జిల్లాలో శుక్రవారం 314 పాఠశాలల్లో నిర్వహించిన విద్యాసాధన సర్వే పరీక్షకు 14,934 మందికి గాను 14,202 మంది విద్యార్థులు హాజరైనట్టు జిల్లా డీసీఈ బోర్డు కార్యదర్శి ఎం.వి.కృష్ణ కుమార్ తెలిపారు. 522 మంది ఫీల్డ్ ఇన్విస్టిగేటర్ల సహాయంతో ఈ పరీక్ష నిర్వహించామన్నారు. మూడు, ఆరు,తొమ్మిది తరగతుల విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలతోపాటు సామాజిక, తరగతి, ఉపాధ్యాయ సంసిద్ధత, పాఠశాల నిర్వహణ వంటి అంశాలపై ఈ సర్వే జరిగిందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారిణి ఎల్.చంద్రకళ, ఉప విద్యాశాఖ అధికారి గౌరీశంకర్, డైట్ అధ్యాపకుడు జి.రవితో కలిసి సర్వే పరీక్షలను పరిశీలించామన్నారు.

మున్సిపల్ స్టేడియంకు మహర్దశ

- రూ.164.50 లక్షలతో ఆధునికీకరణ
- భూమి పూజ చేసిన మేయర్, ఎమ్మెల్యే

జగదాంబ: ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంకు మహర్దశ పట్టింది. ఆధునికీకరణ పనులకు రూ.164.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు జీవీఎంసీ 35వ వార్డులో ఉన్న క్రికెట్ స్టేడియంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి శనివారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్టేడియంకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. స్టేడియం చుట్టుపక్కల వ్యర్థాలు తొలగించి, రోడ్లు, కాలువల నిర్మాణం, ప్రేక్షకులు కూర్చోవడానికి బల్లలు, డ్రెసింగ్ రూమ్‌లు ఆధునికీకరించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ సీఎం సహకారంతో మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరారవు, వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ఇంజినీరింగ్ అధికారి సంతోషి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



స్టేడియం అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా తూర్పు కన్వీనర్, కో-కన్వీనర్ల సస్పెన్షన్

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ తూర్పు సోషల్ మీడియా కన్వీనర్ గరికిన వెంకట్, కో-కన్వీనర్‌లు గరికిన రాధాకృష్ణ, బంగారి భవానీ శంకర్, పొన్నాడ విష్ణువర్ధన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. వీరంతా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ సిఫార్స్ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జోన్‌-8 కార్యాలయంలో ఏసీబీ దాడులు

- టౌన్ ప్లానింగ్‌పై ఫిర్యాదుల వెల్లువ
- ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఏసీబీ అధికారులు

పెందుర్తి: జీవీఎంసీ జోన్‌-8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అవినీతి నిరోధక అధికారులు దాడులు చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై అధికంగా వస్తున్న ఫిర్యాదులతో పాటు ఇతర విభాగాలపై ఫిర్యాదులు అందుకున్న ఏసీబీ అధికారులు కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సంబంధిత అధికారులను విచారించారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ శ్రావణి, డీఎస్పీ రమ్య ఆధ్వర్యంలోని దాదాపు 15 మంది అధికారులు, సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. ప్రధాన కార్యాలయం ద్వారాలు మూసి ప్రతీ అధికారిని, సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. రికార్డులు తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో పలు కీలక అంశాలను ఏసీబీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. శనివారం కూడా ఈ దాడులు కొనసాగే అవకాశం ఉంది.

'పీఎం వన్ క్లిక్ ప్రోగ్రాం' ప్రారంభం

జిల్లాలో 90 మందికి రూ.32.15 లక్షల మంజూరు

మహారాణిపేట: వరల్డ్ ఫుడ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా వ్యాపార అభివృద్ధి కోసం 'పీఎం వన్ క్లిక్ ప్రొగ్రాం'శుక్రవారం జరిగింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని విశాఖ జిల్లా లబ్ధిదారులు వీక్షించారు. జిల్లా నుంచి 90 మంది లబ్ధిదారులకు రూ.32.15 లక్షలు మంజూరయ్యాయని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి తెలిపారు. ఒక్కొక్కరికి రూ.40 వేలు రుణం ఇస్తున్నామన్నారు.

విజయనగరం-రాయగడ లైన్‌లో పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: రాయగడ-విజయనగరం పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఈ నెల 5న విశాఖపట్నం-రాయగడ (08504) పాసింజర్, 6న రాయగడ-విశాఖపట్నం (08503) పాసింజర్ , విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం (08546 / 08545) పాసింజర్, విశాఖపట్నం-కోరాపుట్ (18512) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, 7న కోరాపుట్ -విశాఖపట్నం (18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. ఈ నెల 5న గుంటూరు-రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది.

మనసు చదివిన కుంచె


ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల కుంచె నుంచి జాలువారిన చిత్రాల్లో కొన్ని..


ప్రదర్శనను తిలకిస్తున్న ఓఎస్డీ, ప్రిన్సిపాల్

ఆకట్టుకుంటున్న చిత్రకళా ప్రదర్శన

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం విద్యార్థులు తమ ప్రతిభను ప్రస్ఫుటం చేస్తూ ఏర్పాటు చేసిన కళా ప్రదర్శన నగరవాసుల మనసులను దోచుకుంటోంది. శివాజీపాలెంలోని ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఏర్పాటు చేసిన చిత్ర కళా ప్రదర్శనను శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. అనంతరం వారు ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల తీర్చిదిద్దిన కళారూపాలు, శిల్పాలను తీర్చిదిద్దిన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. వారి ప్రతిభను ప్రశంసించారు. బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ విద్యార్థులు పెన్సిల్, వాటర్ కలర్, కాన్వాస్‌పై రంగులనద్ది రూపొందించిన చిత్రాలు, మట్టి, కర్ర, ఇనుము, కంచు, వ్యర్థాలతో తీర్చిదిద్దిన శిల్పాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శన ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగనుందని విభాగాధిపతి ఆచార్య సింహాచలం తెలిపారు.

6న గాజువాకలో సామాజిక సాధికార బస్సు యాత్ర

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 6న గాజువాకలో జరగనుంది. పాతగాజువాక జంక్షన్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పరిశీలించారు. ఈ యాత్రలో మంత్రులతోపాటు వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కన్వీనర్ సుబ్బారెడ్డి పాల్గొంటారని ఎమ్మెల్సీ తెలిపారు. యాత్ర నిర్వహణపై ఎమ్మెల్యే నాగిరెడ్డితో చర్చించారు. బస్సు యాత్ర విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 64వ వార్డు ఇన్‌చార్జి ధర్మాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నాగిరెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పరిశ్రమల్లో సమస్యలకు కృత్రిమమేధతో పరిష్కారం

ఇంజినీర్లకు స్టీల్‌ప్లాంట్ సీఎండీ సూచన


మాట్లాడుతున్న స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

కొమ్మాది: జాతీయస్థాయి యువ సమ్మేళనం యూత్ కాన్‌క్లేవ్-2023 గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా శుక్రవారం ప్రారంభమైంది. భారత ప్రభుత్వ శాస్త్ర విభాగానికి అనుబంధమైన సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు, ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ సంయుక్తంగా 'ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ గ్లోబల్ చాలెంజస్' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విశాఖ స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణల ద్వారా దేశ ఆర్థిక పురోభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసేందుకు వీలుగా కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటివి అభివృద్ధి చేయాలని సూచించారు. ఉక్కు పరిశ్రమల్లో సివిల్ నుంచి ఐటీ వరకు వివిధ ఇంజినీరింగ్ విభాగాల అవసరం ఉంటుందన్నారు. గ్రీన్ స్టీల్ నినాదంతో ఉక్కు పరిశ్రమల్లో విద్యుత్ వినియోగం నుంచి నీటి వనరుల వాడకం వరకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలన్నారు. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి ప్రభుత్వం రూ.28 వేల కోట్లతో దేశ వ్యాప్తంగా 25 టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని ఐఐటీ, ఎన్ఐటీల నుంచి పరిశోధకులు యువ ఇంజినీర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

అమ్మతో కలిసి బీచ్‌లో ఎంజాయ్ చేశా..

సిటీలో శ్రీలీల సందడి


మాట్లాడుతున్న హీరోయిన్ శ్రీలీల

సీతమ్మధార: సినీ నటి శ్రీలీల శుక్రవారం సందడి చేసింది. నగరానికి వచ్చిన ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా తాను నటించిన చిత్రాల పాటలకు నృత్యాలు చేస్తూ అభిమానులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనకు బాగా నచ్చిన ప్రదేశం విశాఖ అని, చిన్నప్పుడు మా అమ్మ తో కలిసి వైజాగ్ వచ్చానని గుర్తు చేసుకున్నారు. బీచ్‌లో అమ్మతో కలిసి ఎంజాయ్ చేశానని.. మత్స్య దర్శిని, కాళీమాత ఆలయం, సబ్‌మెరైన్ తదితర ప్రాంతాలను సందర్శించానన్నారు. అప్పటికి ఇప్పటికి విశాఖ ఎంతో మారిందని, చాలా బాగుందని తెలిపారు.

గోయాజ్ షోరూం ప్రారంభం

ఆశీలమెట్టలో ఏర్పాటు చేసిన గోయాజ్ వెండి ఆభరణాల షోరూంను శ్రీలీల శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆభరణాలు ధరించి సందడి చేశారు. విశాఖలో గోయాజ్ షోరూం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. షోరూంలో విభిన్న రకాల డిజైన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్లు ప్రియాంక, రవి వేములూరి మాట్లాడుతూ ప్రారంభ ఆఫర్ కింద వెండి కొంటే గోల్డ్ ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 5వ తేదీ వరకు కొనుగోలుపై ఆఫర్లు ఉంటాయని వెల్లడించారు.

సీఎం జగన్‌కు జర్నలిస్టుల కృతజ్ఞతలు


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న పాత్రికేయులు

సీతమ్మధార: రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్న కేబినెట్ నిర్ణయంపై విశాఖలో పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని హర్షం వ్యక్తం చేస్తూ.. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఆర్.రామచంద్రరావు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. విశాఖ అక్రిడిటేటెడ్ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు కె.జి.రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఎన్నికల హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జర్నలిస్టుల విషయంలో అత్యంత సానుకూలంగా వ్యవహరించారన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గురువారం విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇళ్ల స్థలాల కేటాయింపుపై కేబినెట్ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సొసైటీ అధ్యక్షుడు బి.రవికాంత్, పాత్రికేయులు అనురాధ, జి.జనార్దనరావు, దుక్క మురళీ కృష్ణారెడ్డి, పలువురు జర్నలిస్ట్ సంఘాల నాయకులు, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఆటోలో 15 తులాల బంగారం చోరీ

- 40 నిమిషాల్లో దొంగలను పట్టుకున్న పోలీసులు
- ఇద్దరు మహిళల అరెస్ట్, సొత్తు రికవరీ



పెందుర్తి: ఓ ఉపాధ్యాయురాలి వద్ద గల బంగారు ఆభరణాలు చోరీ గురైన కేసును పెందుర్తి క్రైం విభాగం పోలీసులు 40 నిమిషాల్లో ఛేదించారు. నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి బంగారాన్ని రికవరీ చేశారు. పెందుర్తి క్రైం ఎస్ఐ ఎండీ సల్మాన్ బేగ్ తెలిపిన వివరాలివీ.. వేపగుంట సమీపం లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న రౌతు సత్యవతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. శనివారం సత్యవతి కుటుంబ కాశీకి వెళుతున్న నేపథ్యంలో ఇంట్లోని బంగారు ఆభరణాలను ఎన్ఏడీ కొత్తరోడ్డులో నివాసం ఉంటున్న తన తల్లి వద్ద ఉంచేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో 15 తులాల బంగారు ఆభరణాలను సంచిలో సర్దుకుని శుక్రవారం మధ్యాహ్నం ఎన్ఏడీ వెళ్లేందుకు ఆటో ఎక్కారు. అదే సమయంలో నాయుడుతోట వద్ద ఇద్దరు మహిళలు ఆటో ఎక్కి సత్యవతి వద్ద ఉన్న సంచిని చాకచక్యంగా దొంగిలించారు. కాసేపటికి విషయం గుర్తించిన సత్యవతి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే రంగంలోకి దిగిన పెందుర్తి క్రైం విభాగం పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించారు. వారిని పాత నేరస్తులుగా గుర్తించి లొకేషన్ ఆధారంగా 40 నిమిషాల వ్యవధిలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 15 తులాల బంగారం స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఎంవీపీలో ఫిష్ ఆంధ్రా యూనిట్ ప్రారంభం


ఎంవీపీ రైతుబజార్‌లో ఫిష్ ఆంధ్రా యూనిట్ ను ప్రారంభిస్తున్న ఎంపీ, మేయర్

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో ఫిష్ ఆంధ్రా యూనిట్ అందుబాటులోకి వచ్చింది. ఈ యూనిట్‌ను శుక్రవారం విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన చేపలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇక్కడ ఫిష్ ఆంధ్రా యూనిట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలోని అన్ని రైతు బజార్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా తొలిసారిగా ఎంవీపీ రైతు బజార్‌లో ఐదు స్టాళ్లు ఏర్పాటు చేశారన్నారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయశ్రీ మాట్లాడుతూ జిల్లాలో 42 ఫిష్ ఆంధ్ర యూనిట్లు మంజూరు కాగా.. ఇంతవరకు 24 యూనిట్లు నెలకొల్పినట్లు చెప్పారు. రైతు బజార్లకు సంబంధించి మొదటి యూనిట్‌ను ఎంవీపీలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచంద్ర, రైతు బజార్ల ఏడీ ఎస్.కె.యాసిన్, ఎంవీపీ రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, మత్స్యశాఖ అధికారి మురళీ పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదు

విశాఖ లీగల్: వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకు భార్యను హత్య చేసిన వ్యక్తికి విశాఖ జిల్లా మహిళ న్యాయస్థానం జీవితఖైదు విధించింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జి.సువర్ణరాజు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. శివాజీపాలెం ప్రాంతానికి చెందిన నిందితుడు బోసన బోయిన సీతారాముడు నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో సేల్స్‌మన్‌గా పని చేసేవాడు. అదే షాపింగ్ మాల్‌లో విధులు నిర్వరిస్తున్న కమలను ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. అయితే కొద్ది రోజులకు మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం కమలకు తెలియడంతో ఇరువురి మధ్య గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో కమలను అడ్డు తొలగించుకుందామని భావించిన సీతారాముడు 2013, ఆగస్టు 18న ఆమెను హత్య చేశాడు. అయితే ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించాడు. అయితే కమల మృతిపై అనుమానం వచ్చి ఆమె అత్త కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు వాస్తవాలు బయటపడ్డాయి. ఈ కేసు విచారణ చేపట్టిన న్యాయమూర్తి అతను నేరం చేసినట్లు రుజువు కావడంతో జీవితఖైదు విధించారు.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవ జైలు


అప్పికొండ ధర్మసింగ్ మహేష్

విశాఖ లీగల్: అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భార్యను అతి కిరాతకంగా చంపిన హంతకుడికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ నగరంలోని నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీహరి శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 17 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ బర్కత్ ఆలీ అందించిన వివరాలివీ.. నిందితుడు అప్పికొండ ధర్మసింగ్ మహేష్ అనకాపల్లి జిల్లా రాంబిల్లి పోలీస్ స్టేషన్ పరిధి భోగాపురం నివాసి. అతనికి నాగమణితో వివాహం జరిగింది. కొంతకాలం వీరి కాపురం సవ్యంగా సాగింది. తర్వాత కుటుంబంలో కలహాలు, చిల్లర గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో 2009 జనవరి ఒకటో తేదీన సాయంత్రం నాలుగు గంటల సమయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఆ సమయంలో నిందితుడు మహేష్ ఇంట్లోని లాంతరులో కిరోసిన్‌ను నాగమణి ఒంటిపై పోసి నిప్పు పెట్టాడు. తీవ్ర గాయాల మధ్య నాగమణిని కేజీహెచ్‌లో చేర్చారు. మూడు రోజులపాటు చికిత్స పొంది ఆమె మరణించింది. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ అధికారి నవీన్ గులాటి కేసు దర్యాప్తు చేశారు. కేజీహెచ్‌లో బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డ్ చేశారు. నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి 302, 498 ఏ, సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా చెప్పారు.

'ఏఐ'తో అద్భుతంగా నిర్మాణాలు

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్‌రోడ్డు: అత్యాధునిక సాంకేతికతను వినియోగించి ఆర్కిటెక్చర్ ఇంటీరియల్ మెటీరియల్స్(ఏఐ) రూపొందించడం ద్వారా నిర్మాణాలు అద్భుతంగా ఉంటాయని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖపట్నం కేంద్రం ఆధ్వర్యంలో నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన 18వ ఆర్కిటెక్చర్ ఇంటీరియల్ మెటీరియల్స్ ఎక్స్‌పోను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ఏఐలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. ఐఐఏ చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ ఎక్స్‌పోలో కేవలం బిల్డింగ్ సామగ్రిని ప్రదర్శించడమే కాకుండా.. నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. శని, ఆదివారాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన సాగుతుందని వివరించారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ